

# రెండు నెలలు

— మృణాళిని

తలపగిలి పోతోంది సుభద్రకు.కళ్ళు గట్టిగా మూసుకుంది.పళ్ళు బిగపట్టింది. రెండు చేతుల తోనూ తలను గట్టిగా అదిమి పట్టింది. ఇటూ అటూ వేగంగా తల తిప్పింది.క్షణక్షణానికి బాధ ఎక్కువౌతోందేగాని తగ్గడం లేదు. ఒక్కసారిగా కడుపులో తిప్పినట్లయింది. మంచం మీద పడుకుని వున్న తను కొద్దిగా లేచి, మంచం కింద వున్న చిన్న ప్లాస్టిక్ బకెట్‌ను బయటకు లాగింది. భళ్ళున వాంతయింది.లేచి బాత్రూంకు వెళ్ళి నోరు కడుక్కునే వోపిక లేదు.భర్తనో,అత్తగారినో, అక్కనో పిలవాలి. ఎలాగో గొంతు పెగుల్చుకుంది,'అక్కా' పిలిచింది.ఎవరూ పలకలేదు. 'ఏపనిలో వుందో ఏమో' అనుకుని 'అత్తయ్యా' అంది. జవాబు లేదు. 'ఏవండీ' అనబోయి,తమాయించుకుంది. ఆయన ఆఫీసుకు వెళ్ళే టైం. భోజనానికి కూర్చుని వుంటారు. అత్తగారు వడ్డనలో బిజీగా వుంటుంది. తనే లేచివెళ్ళాలి. వెళ్ళ లేకపోతే నోట్లో దుర్వాసన భరిస్తూ పడుకోవాలి. లాభం లేదు. లేవాల్సిందే.

వాంతి అయ్యాక తలనొప్పి తగ్గింది. మెల్లిగా లేచింది. తడబడే అడుగులతో బాత్రూం వైపు నడిచింది. పొద్దుట్నుంచీ ఏది తాగినా, వాంతి అయిపోయినందువల్ల, కడుపు ఖాళీగా వుంది. నాలుగడుగులు వేసే ఓపికలేదు. తల గిర్రున తిరగడంతో గోడ పట్టుకుని నిల్చుంది.

"అబ్బబ్బ సుభద్రా,నువ్వెందుకు లేవాలి చెప్పు. మేమంతా లేమా! మమ్మల్ని పిలవకూడదూ?" అనహనాన్ని అతికష్టం మీద కప్పిపెడుతున్న ఆప్యాయత. అక్కయ్య గొంతువిని, మెల్లిగా వెనక్కి తలతిప్పింది. "ఫర్వాలేదక్కా, ఎంతసేవని నా దగ్గరుంటావు? బాత్రూంకెళ్ళి నోరు కడుక్కుందామనుకున్నా అంతే" ఒక్క పనీ స్వంతంగా చేసుకోలేని అశక్తతకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏడేళ్ళ పిల్లగా అమ్మకు అంట్లు తోమిపెట్టింది. ఇప్పుడు తన పళ్ళు తోముకోవడానికి కూడా మరొకరి సాయంకావాలి.

అక్క చెంబులో నీళ్ళిస్తే మొహం కడుక్కుని, అక్క చేతి ఆసరాతో తిరిగి వచ్చి మంచం మీద పడుకుంది.

"నువ్వు అస్తమానం లేచి నీ పనులు చేసుకుంటాననకు, ఏ బాత్రూంలోనో పడిపోయినా,తలుపు కొట్టుకున్నా మళ్ళీ మాకు రెట్టింపు పనేకదా. ప్లీజ్ భద్రా,మా బాధలు నువ్వు బొత్తిగా పట్టించుకోకపోతే ఎలా?"

సుభద్ర నిజమేనన్నట్టు తల వూపింది.

"సారీ అక్కా. ఇకపై బుద్ధిగా వుంటాను."

శోభ ప్రేమగా నవ్వింది. "నీ బాధ తెలీకకాదు. కానీ ఆసలే నయంకాని జబ్బును ఎందుకు పెంచుకుంటావు?" ఆప్యాయంగా అంది.

సుభద్ర కూడా చిన్నగా నవ్వి,కళ్ళు మూసుకుంది. తనకు సేవ చేయడంకోసం శోభ సంసారాన్ని వదులుకుని రెండు నెలలనుంచి ఇక్కడ వుంది. భర్తను, పిల్లల్ని వదిలి ఇంతకాలం వుండడం, వాళ్ళు కూడా అభ్యంతరం చెప్పక పోవడం సామాన్య విషయం కాదు.

సుభద్ర అలసటగా కళ్ళు మూసుకుంది. ఇక తనకు మిగిలింది ఇదే. కళ్ళు మూసుకుని విశ్రాంతి తీసుకోవడం. విశ్రాంతిట. నవ్వొచ్చింది సుభద్రకు. 30 ఏళ్ళ వయస్సులో, చలాకీగా ఇంటిపనులు, ఆఫీసుపనులు, పిల్లల పెంపకం చూసుకోవాల్సిన వయస్సులో తనకు అపారమైన విశ్రాంతి! రోజుకు 16 గంటల పనిలో శరీరం మెదడు కూడా అలసి పోవాల్సిన తరుణంలో తనకు 24 గంటల నిద్ర. ప్రేమించే భర్త, ముద్దులు మూటగట్టే పిల్లల గురించి తీయని కలలు కనాల్సిన సమయంలో తనకు పీడకలలు. చావుకోసం ఎదురు చూస్తూ జాగరణ!

"నాన్నా, నాకు సైకిల్ కొనిపెడ్తావా లేదా?" కూతురి గొంతు. "అబ్బ, ఆఫీసుకు బయల్దేరుతున్నపుడు ఇవేం ప్రశ్నలమ్మా...సాయంత్రం మాట్లాడుకుందాం" భర్త చిరాకు. "నాకదంతా తెలీదు. నువ్వు చెప్పాల్సిందే. సైకిల్ కొంటావా? కొనవా?" ఐదేళ్ళ పిల్ల గొంతులో ఎంత ఖచ్చితం!

భర్త గొంతు తగ్గించాడు. అయినా వినబడుతూనే వుంది.

"ఓ రెండు నెలలు ఓపిక పట్టమ్మా. ఇప్పుడున్నంత ఖర్చు అప్పుడుండదు కదా.కొనిపెడ్తా"

"ఇప్పుడేం ఖర్చులు? అమ్మ మందులేనా?" గొంతు తగ్గించాలన్న లౌక్యం తెలీని వయసు పాపది.

"ఊ...తెలిసి కూడా మళ్ళీ అడుగుతావెందుకు?"

"మరి, రెండు నెలలయ్యాక అమ్మకు మందులు వద్దా?"

ఓ క్షణం నిశ్శబ్దం: ఆ తర్వాత, "వెధవ ప్రశ్నలడక్కు"

భర్త బూట్ల టకటకలు దూరమయ్యాయి.

వింటున్న సుభద్రకు మళ్ళీ సన్నగా తలపోటు ప్రారంభమైంది. ఇంకాస్సేపటికి తల బద్దలౌతుంది. మళ్ళీ వాంతి అవుతుంది. మళ్ళీ కాస్సేపు ఊరట... పది నిమిషాల వ్యవధి. తర్వాత మళ్ళీ మామూలే.

"ఏమ్మా, సుభద్రా, పళ్ళరసం తీసివ్వనా?" అత్తగారి గొంతు వినిపించి కళ్ళు తెరిచింది. తన మంచం




పక్కకు కుర్చీ లాక్కొని కూర్చుంది ఆవిడ.

"ఇందాక వాంతి అయిందటగా! శోభ చెప్పింది. కాస్త ఏమైనా తాగుతావా?" పొద్దుటినుంచి పిల్లల్ని చూసుకుని, వంట చేసి పొందిన అలసట మొహంలో కనిపిస్తోంది.

"వద్దులే అత్తయ్యా. శోభ కలిపిస్తుంది లెండి. అసలు తనెక్కడా?"

"పిల్లల్ని స్కూల్లో దింపడానికి వెళ్ళింది. ఇవాళ ఆయా రాలేదు కదా" అని,"అయినా నీకెలా తెలుస్తుందిలే; పొద్దస్తమానం గదిలో పడుకునే దానివి. మేం చెప్తేనే కదా పిల్లల గురించి నీకు తెలియడం" అంటూ లేచి నిల్చుంది. "ఇప్పుడే కాస్త తీరిక నాకు. బత్తాయి రసం తీస్తాను. తర్వాత నడుం వాల్చానంటే లేవలేను." అంటూ ఆవిడ వంటింట్లోకి వెళ్ళింది. నిజానికి సుభద్రకు ఇప్పుడు ఏమీ తాగాలని లేదు. కడుపులో తిప్పుతున్నట్లుగా వుంది. తలపగిలి పోతూంది. కానీ తప్పదు. ఇచ్చినపుడు పుచ్చుకోకపోతే కావాల్సినపుడు ఇచ్చే వాళ్ళుండరు.

అత్తగారు గ్లాసు చేతికి అందించింది. తలనొప్పిని అదిమిపెట్టడానికా అన్నట్లు కళ్ళు గట్టిగా మూసుకుని, గ్లాసు అందుకుని తాగబోయింది. సగం ద్రవం లోపలికి వెళ్ళేసరికే భళ్ళున వాంతయింది. చేతిలోని గ్లాసు కిందపడి తక్కిన సగం నేలపాలైంది.

"అయ్యొయ్యో, నేను తీసినంత సేపు పట్టలేదు కదే కక్కడానికి. ఈ మహాభాగ్యానికి వాడు డజన్లకొద్దీ పళ్ళు తెచ్చి పడేయడం దేనికో... ఉండుండు నువ్వు లేవకు. మళ్ళీ కళ్ళు తిరిగి పడగలవు. నేను తుడుస్తాను." మరో పది నిమిషాలలో బత్తాయి రసం ముచ్చట తాలూకు ఛాయలు కూడా మిగల్లేదు.

కాస్సేపటికి సుభద్రకు నిద్రపట్టింది. ఎంతసేపైందో తెలీదు. తెలివి వచ్చేసరికి పక్కగదిలో అత్తగారు, పక్కయింటి విశాలాక్షి మాట్లాడుకుంటున్నారు.

"డాక్టర్లు ఏమంటున్నారు పిన్నిగారూ?" విశాలాక్షి గొంతులో అణుచుకోలేని కుతూహలం.

"ఏముంది అనేందుకు? మహా అయితే రెండు నెలలు బతుకుతుందంటారు. ఇది వరకు కూడా చెప్పలేదూ, నెలకంటే ఎక్కువ రోజులు బతకదని. అయినా బతికిందిగా.... ఈసారి ఏమౌతుందో ఏమో."

"ప్చ్ ఎంతైనా ఇంట్లో దీర్ఘరోగి వుంటే కష్టమండీ. అట్లా ఇట్లా జబ్బా! కేన్సరాయె. మాయదారి రోగం. రెండు రోజులు బతుకుతారో, రెండేళ్ళు బతుకుతారో తెలీదు. మధ్యలో ఈ వయసులో మీకు శ్రమ..."

"నా శ్రమ మాటకేంగాని, మా వాడిని తలుచుకుంటూంటే కడుపు తరుక్కుపోతుందనుకో. ఏడాది నుంచి సంసారసుఖమన్న మాట ఎరుగునా? పైపెచ్చు వేలకొద్దీ ఖర్చు...... ఇరుగు పొరుగు, ఆఫీసు వాళ్ళు జాలి.... ఒకళ్ళిద్దరు అన్నారు కూడా, మళ్ళీ పెళ్ళి చేయకూడదా అని. వాడినడిగితే ససేమిరా చేసుకోనంటాడు.... ముచ్చటగా ఓ మాటైనా మాట్లాడలేని పెళ్ళాం మీద ఏం ప్రేమో... అయినా....... ఈ రెండు నెలలూ గడిచి పోనీ..... పెళ్ళాం వుండగా మారుపెళ్ళి చేసుకున్నాడన్న అప్రదిష్ట వాడికెందుకు?"

"మీరు మీ కొడుకు గొప్పే చూస్తున్నారు గానీ, కోడలికి ఇంతసేవ చేసే అత్తగార్లు ఎక్కడైనా ఉంటారాండీ.... మీ గొప్పతనం మీకు తెలియదు."

"ఏం గొప్పో. ఎంత చేసినా ఎవరున్నారు గుర్తించేందుకు? ఏడాది క్రితం ఈ రోగం వచ్చిందని తెలిసినపుడు ఒకటి రెండు నెలలకంటె బతకదనుకున్నాం. ఇంతకాలం సఖ్యంగా వుండి చివరి క్షణాల్లో కోడలి ఉసురు పోసుకోవడమెందుకని భరించాను. కానీ ఇప్పటికి ఏడాదైంది. నాకు విముక్తి సూచనలు లేవు" గట్టిగా నిట్టూర్చిందావిడ.

సుభద్రకు గుండెల్లో సన్నగా మంటలాంటిది ప్రారంభమైంది. వేడిగా ఏదైనా తాగాలని వుంది. "అక్కా" అని పిలిచింది. మూడుసార్లు పిలిచాక అత్తగారు వచ్చింది.

"పిలిచావా? కాఫీ ఇవ్వనా. ఇప్పుడే లేచాను నేనూను. విశాలాక్షి వచ్చింది. కాఫీ పెడదామను కుంటుండగా నువ్వూ లేచావు" అనేసి మళ్ళీ వెళ్ళిపోయింది.

సుభద్రకు నవ్వొచ్చింది.'పాపం అత్తయ్య. నావల్ల అందరికీ అబద్ధాలు అలవాటయ్యాయి. హిపోక్రసీ జీవిత విధానమైపోయింది. పొద్దుట్నుంచి కడుపులో తిండిలేదు. డాక్టర్ ఇష్టం వచ్చింది తినమంటాడు. కానీ ఆయన, అత్తగారు తిననివ్వరు. 'పులుపు, కారం తినకు కావాలంటే తీపి తిను' అంటారు. వాంతులు చేసుకుని చేదెక్కిన నోటికి పుల్లగా, కారంగా ఏదైనా తింటే బాగుంటుందనిపిస్తుంది. ఏమైనా అంటే 'నీ మంచి కోసమే' అంటారు. 'మేము నీమేలు కోరేవాళ్ళం కాదా! నీ ఆరోగ్యం కోసం డబ్బు నీళ్ళల్లా ఖర్చు పెట్టడం లేదా?' అని వాదిస్తాడు భర్త. కాని... ఎన్నివేలు ఖర్చు పెట్టినా తను బతికేది మరో రెండు, మూడు నెలలేనని, ఆ కొంత కాలమైనా తను మనసారా జీవించాలనుకుంటోందనీ వాళ్ళకు ఎందుకు అర్థంకాదు. తను చచ్చిపోతోందని తనకు తెలుసు. కనీసం ఊపిరాడుతున్నంత సేపైనా ఎందుకు బతకనివ్వరు! పిల్లలతో పాటు ముందు గదిలో కూర్చుని సరదాగా టి.వి. చూడాలని వుంటుంది. ఎప్పుడైనా లేచివెళ్తే చాలు, భర్త, అత్తగారు పరిగెత్తుకు వస్తారు. 'వద్దొద్దు టి.వి. చూస్తే కళ్ళు నొప్పెడతాయ్. మళ్ళీ తలనొప్పి వస్తుంది' అని తరిమేస్తారు.

ఏ వినోదమూ, ఏ ఆనందమూ లేకుండా చీకటిగదిలో, ఒంటరిగా, మాటా, పలుకూ లేకుండా జీవిస్తే ఆయుష్షు పెరుగుతుందా? ఒకవేళ పెరిగినా అదీ ఒక జీవితమేనా?

చీకటి పడింది. ఇంటిల్లిపాదీ లేచి టి.వి. చూస్తూ భోంచేస్తూంటారు. ఏడాది క్రితం తను కూడా వాళ్ళతో పాటు కబుర్లు చెబుతూ వడ్డించింది... మూర్తి స్కూటర్ ఆగినశబ్దం. గబగబా లోపలికి వచ్చి పిల్లలతో డ్రెసింగ్ టేబిల్ ముందు కూర్చున్న శబ్దం వినిపిస్తూనే వున్నాయి.

"భద్ర ఏమైనా తిందా?" మూర్తి గొంతు.

"ఏం తింటుంది. పొద్దుట్నుంచీ ఒకటే వాంతులు."

"మందు వేసుకుందా?"

"ఆ వేసుకునే వుంటుంది. నువ్వు తిడతావని తెలుసుగా"

కాస్సేపు నిశ్శబ్దం. మళ్ళీ అత్తగారి గొంతు...

"మూర్తీ... ఓ విషయం...ఈ మధ్య డాక్టర్‌ని కలిశావా? ఏమంటున్నాడు?"

"ఏముంది అనడానికి మరో రెండు నెలలో, మూడు నెలలో! ఏం? ఎందుకు?" ఈ సంభాషణ రోజూ జరిగేదే. మృత్యువు వారిని భయపెట్టే మాటకాదు. అలవాటుగా పలుకుబడిలో చేరిపోయిన మాట.

"ఏం లేదుగాని, రామలింగంగారు వారి రెండో అమ్మా యిని నీకివ్వడానికి ఇంకా సిద్ధంగానే ఉన్నారు. సుభద్ర చేత నంతకం పెట్టించుకుంటే చాలటగా..."

"అబ్బబ్బ ఏమిటమ్మా నీ చాదస్తం! ఇంతకాలం ఓపిక పట్టిన వాడు ఆ రామలింగం మరో ఏడాది ఆగలేడా! పెళ్ళాం పోయిన నెలరోజులకే పీటలమీద కుర్చున్నాడన్న అపవాదు నాకొద్దు..." కుర్చీ లాగిన శబ్దం. సింక్‌లో నీరు పడుతున్న శబ్దం.

సుభద్ర మనసు స్తబ్దంగా వుంది. ఎంత పిచ్చిది తను? క్రుంగి కృశించిపోయి, మాట్లాడ లేకపోయినా, భర్త తనను ప్రేమించాలన్న కోరిక చావలేదు. నోట్లో ముద్దలు పెట్టి ఏడాదైనా, పిల్లలు తనను అంటిపెట్టుకు వుండాలనే ఆశ చావలేదు. తన భర్తా, అత్తగారూ, అందరూ తనకు కేన్సర్ వుందని తెలిసిన రోజున భోరున ఏడ్చినవారే. కానీ ఎంతకాలమని మనిషి తన సుఖాన్ని చంపుకుంటాడు? ఎన్నేళ్ళని మరొకరి కోసం ఏడుస్తాడు? తను చనిపోతే వాళ్ళు సంతోషించక పోవచ్చు. కానీ రిలీఫ్ పొందుతారు. గత ఏడాదిగా లేని మనశ్శాంతి పొందుతారు. మరొకరికి ఉపయోగ పడుతున్నంత కాలమే మనిషి జీవితానికి విలువ. మరొకరికి భారమయ్యాక ఆ ప్రాణం విలువ గడ్డి పోచకంటె హీనమే.... అందులోనూ 'ఆడప్రాణం' విలువ. ఇదే కేన్సర్ మూర్తికి వచ్చి తను సేవలు చేసివుంటే అది తన కర్తవ్యం, విద్యుక్తధర్మం మాత్రమే. మూర్తి చేస్తున్నాడు. కనక అతను త్యాగశీలి, ఉదారుడు.... నిస్వార్థపరుడు.... ఇంత త్యాగాన్ని తను భరించలేదు. ఇంక రెండు నెలలేనా? అని బాధపడింది ఈ ఉదయం. ఇంకా రెండు నెలలా! అని భయపడుతోంది ఈ రాత్రి. రోజూ రాత్రిలాగే ఈ రోజు కూడా గార్డినాల్ మాత్ర మింగింది.

"భగవాన్! ఈ రాత్రి నాకు తెల్లవారనీయకు" అనుకుంటూ.